రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6:28 (ఆదివారం సాయంత్రం) సహర్ 5:04 (సోమవారం ఉదయం)

ఘనంగా కాన్షీరాం జయంతి

జగిత్యాల అర్బన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలో బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం జయంతి వేడుకలను బీఎస్పీ శ్రేణులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పట్టణంలోని చౌరస్తా వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు బిరుదుల లక్ష్మణ్, కార్యదర్శి బొల్లంపల్లి సంపత్‌కుమార్, శివశంకర్, శనిగారం కాంతక్క, దీకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పసుపు పంటకు మద్దతు ధర చెల్లించాలి

జగిత్యాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పసుపు పంటకు క్వింటాలుకు రూ. 15 వేల మద్దతు ధర చెల్లించాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్సీ ఎల్ రమణ డిమాండ్ చేశారు. శనివారం శాసన మండలి సమావేశాల సందర్భంగా హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఫ్లకార్డు ప్రదర్శన జరిపారు. పసుపు మార్కెట్‌లో సరియైన ధర రాకపోవడంతో రైతులు విలవిలలాడుతున్నారంటూ ఫ్లకార్డు ప్రదర్శించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో పాటు ఎమ్మెల్సీ ఎల్ రమణ పాల్గొన్నారు.

నగదు రహిత లావాదేవీలపై అవగాహన

మల్యాల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): బ్యాంకు వినియోగదారులు డిజిటల్ పేమెంట్స్‌ను విరివిగా వినియోగించుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మల్యాల శాఖ మేనేజర్ విశ్వప్రసాద్ సూచించారు. మల్యాలలోని ఎస్‌జీఆర్ స్కూల్‌లో శనివారం బ్యాంకు డిజిటల్ పేమెంట్స్‌పై వినియోగదారులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్‌ఎంబీ నారాయణ, రజిత, దివ్య, అప్రైజర్ ఆకోజు శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు

విద్యార్థినికి ఆర్థికసాయం

జగిత్యాలరూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కండ్లపల్లి మోడల్ స్కూల్ విద్యార్థిని కనకాల దీపిక బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు రూ. 46,200 ఆర్థికసాయాన్ని శనివారం పాఠశాలలో బాధితురాలి సోదరి దుర్గకు అందజేశారు.

కోరుట్ల తహసీల్దార్ బదలీ

కోరుట్ల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల తహసీల్దార్‌గా పనిచేస్తున్న కిషన్‌ను బదిలీ చేస్తూ కలెక్టర్ సత్యప్రసాద్ శనివారం ఉత్తర్వులను జారీ చేశారు. కిషన్‌ను కలెక్టరేట్ ఏవోగా బదిలీ చేస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వులను జారీ చేశారు. కోరుట్ల తహసీల్దార్‌గా ఇప్పటి వరకు ఎవరిని నియమించలేదు.

భవిత కేంద్రాలకు భరోసా



- సామగ్రి కొనుగోలుకు నిధుల మంజూరు
- ఒక్కో కేంద్రానికి రూ. రెండు లక్షలు
- జిల్లాలో మూడు సెంటర్లు
- ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు సుమారు రెండు వేల మంది
- క్రమబద్ధీకరణకు నోచుకోని భవిత ఉపాధ్యాయులు



జగిత్యాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రాలకు వచ్చే ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు వసతులు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పాఠశాల స్థాయి చిన్నారులకు భవిత కేంద్రాల్లో ఐఈఆర్పీ (ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్) బోధన అందిస్తున్నారు. భవిత కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం భవిత కేంద్రాలకు భరోసా కల్పిస్తూ నిధులు విడుదల చేసింది. జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, ధర్మపురిలో భవిత కేంద్రాలు ఉండగా సొంత భవనాలు కలిగిన మూడు కేంద్రాలకు వివిధ పరికరాలు, సామగ్రి కొనుగోలు ఒక్కో కేంద్రానికి రూ. 2 లక్షల చొప్పున మొత్తం రూ. 6 లక్షలు మంజూరు చేస్తూ... సమగ్రశిక్షా ద్వారా ఉత్తర్వులు ఇచ్చింది. సుమారు పదేళ్ల తరువాత భవిత కేంద్రాలకు నిధులు కేటాయించడంతో విద్యార్థుల సమస్యలు తీరుతాయని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.

ప్రత్యేక కమిటీ ద్వారా..

జిల్లా వ్యాప్తంగా సుమారు 2,100 మందికిపైగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలున్నట్లు అంచనా ఉంది. ఒక్కో భవిత కేంద్రం 20 నుంచి 30 మంది చొప్పున చిన్నారులకు ఐఈఆర్పీలు రోజూ ఫిజియోథెరఫీ చేసి ఆటాపాటలతో కూడిన విద్యను అందిస్తున్నారు. కేంద్రాలు లేని చోట నాన్ ఐఈఆర్సీ కేంద్రాల్లో విద్యార్థులకు సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం పాత భవిత కేంద్రాలకు మంజూరైన నిధులతో ప్రత్యేక కమిటీ ద్వారా సౌకర్యాలు సమకూర్చాల్సి ఉంటుంది. ఎంఈవో, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు, భవిత కేంద్రం అనుసంధానంగా ఉన్న ప్రధానోపాధ్యాయుల నేతృత్వంలో వీటిని సమకూర్చనున్నారు.

115 రకాల సామగ్రి అందుబాటులోకి...

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు వచ్చిన నిధులతో 115 రకాల సామగ్రి అందుబాటులోకి తీసుకురానున్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధనోపకరణాలు, ఐఈఆర్పీలకు కుర్చీలు, చికిత్స అందించే బల్లలు, మసాజ్‌బాల్, డంబెల్స్, రౌండ్ టేబుల్,

మిగతా 6వ పేజీలో

విద్యార్థులకు ఎంతో మేలు..



ప్రభుత్వం సమగ్ర శిక్షా నుంచి భవిత కేంద్రాలకు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అవసరమయ్యే బోధనోపకరణాలు అందుబాటులోకి తీసుకొస్తాము. తద్వారా విద్యానైపుణ్యాల పెంపొందించడంతో ప్రత్యేక విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది.

- మహేశ్, భవిత జిల్లా కోఆర్డినేటర్

ప్రత్యేక ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి



దివ్యాంగ పిల్లలను విద్యాబోధన చేయాలని ప్రభుత్వం ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించింది. భవిత కేంద్రంలో ఆటా పాటలతో ఏళ్ల తరబడి విద్యాబోధన చేస్తున్న ప్రభుత్వం మమ్మల్ని క్రమబద్ధీకరించడం లేదు. ఇరవై ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్నా రెగ్యులరైజ్ కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాము.

ఎం రాజబాబు, ప్రత్యేక ఉపాధ్యాయుడు, భవిత కేంద్రం, జగిత్యాల



బోధన చేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయుడు

అభివృద్ధి పనులు ప్రారంభించిన కేంద్రమంత్రి

మల్యాల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలంలో రూ.1.02 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ప్రారంభించారు. ఆ మేరకు మల్యాల మండలం బల్వంతాపూర్‌లో సీసీ రహదారులకు సంబంధించి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున గ్రామస్థులు సంజయ్‌కు స్వాగతం పలికారు. సర్వాపూర్‌లో బీజేపీ జెండాను ఎగురవేశారు. అనంతరం లంబాడిపల్లిలో బీజేపీ కార్యకర్త గొర్రె గంగయ్య ఇంట్లో భోజనం చేశారు. ముత్యంపేటలో ఛత్రపతి శివాజీ, నేతాజీ విగ్రహాలకు పూలమాలలు వేశారు. బీజేపీ శ్రేణులు సంజయ్‌తో సెల్ఫీలకు పోటీలు పడ్డారు. కేంద్ర మంత్రి వెంట మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ, నాయకులు బింగి వేణు, గాజుల మల్లేశం, బొట్ల ప్రసాద్, సంగని రవి, కోను లక్ష్మణ్, పొన్నం సాయి, గుండేటి గంగారాం, రుత్త కిషన్, సామ మహిపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గౌతం, బొద్దుల మహేందర్, మల్లేశం, మల్లేశం యాదవ్ పాల్గొన్నారు.

- **వినతుల వెల్లువ**

మండల పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు పదుల సంఖ్యలో వినతిపత్రాలు సమర్పించారు. గొర్రెగుండం గ్రామస్థులు రామన్నపేట నుంచి గొర్రెగుండం రహదారి, ట్రాన్స్‌ఫార్మర్ కోసం వినతిపత్రం అందించారు. మల్లేగుట్ట అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కమిటీ సభ్యులు, పలు కుల సంఘాలకు నిధులు కేటాయించాలని సంజయ్‌ను కోరారు. కేంద్రమంత్రి పర్యటన సందర్భంగా జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, సీఐ నీలం రవి, ఎస్సైలు నరేశ్‌కుమార్, సందీప్, కిరణ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



బల్వంతాపూర్‌లో గ్రామస్థులకు అభివాదం చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

వైభవంగా ఉగ్రనరసింహస్వామి డోలోత్సవం

- భారీగా తరలివచ్చిన భక్తులు

5



తెప్పోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

కలెక్టర్ సత్యప్రసాద్

జిల్లాలోని పలు పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) తరగతులు ప్రారంభం

6



ఏఐ తరగతులను ప్రారంభిస్తున్న కలెక్టర్

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- కలెక్టర్ సత్యప్రసాద్



దివ్యాంగ విద్యార్థులకు పరికరాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ తదితరులు

జగిత్యాల అగ్రికల్చర్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓల్డ్ హైస్కూల్ ఆవరణలో గల భవిత సెంటర్‌లో అలింకో కార్పొరేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. అందులో భాగంగానే శనివారం పరికరాలను అర్హులైన దివ్యాంగ విద్యార్థులకు అందజేస్తున్నామన్నారు. చిల్డ్రన్ స్పెషల్ నీడ్ స్కూళ్లలో చదువుతున్న అంగవైకల్యం ఉన్న విద్యార్థులకు అలింకో కార్పొరేషన్ ద్వారా సుమారు 10లక్షల విలువైన పరికరాలను 120మంది పిల్లలకు అందించామన్నారు. అనంతరం జాబితాపూర్ గ్రామంలో జడ్పీహెచ్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్ విద్యా బోధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్టిఫీషియల్ బోధన ద్వారా కంప్యూటర్ నైపుణ్యాలు నేర్చుకోవడం పిల్లలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులకు కంప్యూటర్ నైపుణ్యం పెరుగుతుందని, నైపుణ్యాలను పెంచుకునే అవకాశం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఈవో రాము, ఆర్డీవో మధుసూదన్, డీడబ్ల్యూవో నరేష్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌వీ నాయకులపై చర్యలు తీసుకోవాలి



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

కథలాపూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచితంగా వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టిన బీఆర్‌ఎస్‌వీ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం కథలాపూర్ ఎస్సై నవీన్‌కు ఎన్‌ఎస్‌యూఐ నాయకులు ఫిర్యాదు చేశారు. కక్షపూరితంగా ప్రభుత్వాన్ని అగౌరవ పరుస్తూ పోస్టింగ్‌లు పెట్టిన వ్యక్తులపై కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో వేములవాడ నియోజకవర్గ ఎన్‌ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుల సంతోష్, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు దొమ్మాటి అర్జున్, రాధారపు సాయితేజ, నల్ల ప్రదీప్, హేమంత్ తదితరులు ఉన్నారు.

కూలీలకు రూ.300వేతనం వచ్చేలా పని కల్పించాలి

మల్యాల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు రోజుకు కనీసం 300 రూపాయల వేతనం వచ్చేలా పనులు కల్పించాలని డీఆర్డీవో రఘువరన్ సూచించారు. మండలంలోని మల్యాల, రామన్నపేట గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండ తీవ్రత దృష్ట్యా పనిప్రదేశంలో నీరు, ప్రథమ చికిత్సకు సంబంధించిన వాటితో పాటు నీడ కోసం సౌకర్యం కల్పించాలని సూచించారు. డీఆర్డీవో వెంట ఎంపీడీవో స్వాతి, ఏపీవో శ్రీనివాస్, పంచాయితీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన ఏజీపీ

జగిత్యాల క్రైం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అడిషనల్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ)గా ఇటీవల ఇమ్మడి శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమను మర్యాదపూర్వకంగా కలిసి ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో కోర్టు డ్యూటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనృసింహస్వామి చిత్ర పటాన్ని అందజేస్తున్న ఏజీపీ

తడి చెత్త, పొడి చెత్తపై అవగాహన

ధర్మపురి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణం లోని మున్సిపల్ కార్యాలయంలో తడి చెత్త, పొడి చెత్త గురించి పారిశుధ్య కార్మికులకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ బాలె గంగాధర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్యాల గంగాధర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరు మహేష్, టీఎంసీ జలంధర్, ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారులను మోసం చేస్తే చర్యలు

మెట్‌పల్లి టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులను మోసం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు హెచ్చరించారు. శనివారం పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగస్థుల భవనంలో ప్రపంచ వినియోగదారుల దినోత్సవంను నిర్వహించంగా సివిల్ జడ్జి నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సివిల్ జడ్జ్ నాగేశ్వరరావు మాట్లాడారు. వంద రూపాయల వస్తువు కొనుగోలు చేసినా వినియోగదారుడు రశీద్ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యుడు పుప్పాల లింబాద్రి, వేణుగోపాల్, వెంకటస్వామి, శంకర్ రెడ్డి, శేఖర్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘ సభ్యులు నందగోపాల్ పాల్గొన్నారు.

జగిత్యాల అర్బన్: వినియోగదారులు మోసానికి గురైతే కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. శనివారం సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హరి అశోక్‌కుమార్ వినియోగదారుల సంఘం ముద్రించిన వినియోగదారులకు అవగాహన పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, వి.హన్మంత రెడ్డి, వెలుముల ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు

చట్టాలపై అవగాహన ప్రధానం

జగిత్యాల అగ్రికల్చర్: ప్రతీ వినియోగదారునికి వినియోగదారుల చట్టం, హక్కులపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అరిగెల అశోక్ అన్నారు. అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు ప్రశ్నించే తత్వం పెరిగాలన్నారు. వస్తువులను ప్రమాణాలకు భిన్నంగా అమ్మితే వినియోగదారుల ఫోరంను ఆశ్రయించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలి

- ఎస్పీ అశోక్‌కుమార్

మెట్‌పల్లి రూరల్, మార్చి, 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దాపూర్ గ్రామంలోని మల్లన్నస్వామి బోనాల జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశించారు. శనివారం ఆలయం సందర్శించి పరిసరాలు, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సౌకర్యాలు, అత్యవసర సేవలు, పోలీసు బందోబస్తు, తదితర అంశాలను పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రత కల్పించడంలో పోలీసులు ఎల్లప్పుడు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతీ ఒక్కరు శాంతిభద్రతలు కాపాడేందుకు నిర్వాహకులు, గ్రామస్థులు సహకరించాలన్నారు. ఏవైన అనుమానిత వస్తువులు, వ్యక్తులు కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని, నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్పీ వెంట మెట్‌పల్లి డీఎస్పీ రాములు, కోరుట్ల సీఐ సురేష్, ఎస్ఐలు శ్రీకాంత్, శ్యామ్‌రాజ్, నవీన్, అధికారులు, సిబ్బంది, నాయకులు మిట్టపల్లి నారాయణరెడ్డి, కాటిపల్లి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



పెద్దాపూర్‌లో జాతర ఏర్పాట్లను తెలుసుకుంటున్న ఎస్పీ అశోక్‌కుమార్

ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుమన్‌రావు, ఆర్‌ఎంవో డాక్టర్ విజయ్ అన్నారు. శనివారం పట్టణంలోని జనరల్ ఆసుపత్రిలో రోగుల అవసరాలకు అనుగుణంగా పలు వీల్‌చైర్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సకల వసతులతో రోగులకు సేవలందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హోలీలో హుషారుగా.. కాసేపటికే గుండెపోటు

● ఆసుపత్రికి తరలించేలోపే మహిళ మృతి



జ్యోతి(ఫైల్)

మల్యాల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): తోటి మహిళలతో హుషారుగా హోలీ వేడుకల్లో పాల్గొని వారితో కలిసి సంబరాలు చేసుకొని ఇంటికి వెళ్లిన ఓమహిళ కాసేపటికే గుండెపోటుతో మృతి చెందడం విషాదంగా మారింది. ఆడుతూ.. పాడుతూ తమతో ఉన్న మహిళ గంటల వ్యవధిలోనే మృతిచెందడం తోటివారిని కంటతడి పెట్టించింది. వివరాలు ఇలా ఉన్నాయి. మల్యాల మండలం రామన్నపేటకు చెందిన సిరిమల్ల జ్యోతి అలియాస్ రమ(40) అనే మహిళ హోలీ పండగ సందర్భంగా శుక్రవారం రాత్రి తోటిమహిళలతో కలిసి రాత్రి11గంటలవరకు వేడుకల్లో పాల్గొని తరువాత ఇంటికి వెళ్లింది. భోజనం చేసి పడుకున్న కాసేపటికే చాతిలో నొప్పి అని తెలపడంతో కుటుంబసభ్యులు చికిత్స కోసం జగిత్యాల ఆసుపత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యంలో మృతి చెందింది. దీంతో కుటుంబంలో, గ్రామంలో విషాదం నెలకొంది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

హోలీ వేడుకలో విషాదం

● స్నానానికి వెళ్లి చెరువులో పడి వ్యక్తి మృతి

ముత్తారం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కారం గ్రామంలో హోలీ వేడుకలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన ముదురుకోళ్ల సమ్మయ్య (45)శుక్రవారం హోలీ అనంతరం స్నానం చేయడానికి లక్కారం చెరువు వద్దకు వెళ్ళి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. హోలీరోజు గ్రామంలో పలువురి వద్ద డబ్బులు అడుక్కొని మద్యం సేవించి స్నానం చేయడానికి వెళ్లి చెరువులో పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

కరీంనగర్ క్రైం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం రెడ్డిరామయ్యపల్లి స్టేజీ వద్ద శుక్రవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదంలో రామడుగుమండలం వెదిర గ్రామానికి చెందిన మల్యాల సత్తయ్య(55) మృతిచెందాడు. పోలీసుల వివరాలప్రకారం.. మల్యాల సత్తయ్య రాత్రి 11:30 గంటలకు వెదిర నుంచి కరీంనగర్‌కు బైక్‌పై వస్తున్నాడు. రెడ్డిరామయ్యపల్లి స్టేజీవద్ద ఎదురుగా వచ్చిన బైక్ అతివేగంగా ఢీకొట్టింది. సత్తయ్య ఎగిరిరోడ్డుపై పడడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సత్తయ్య భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొత్తపల్లి మెడికల్ కళాశాల వద్ద..

కరీంనగర్ క్రైం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మెడికల్ కళాశాల వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో రేకుర్తికి చెందిన సుతారి అక్కపెల్లి భూమయ్య(48) అక్కడికక్కడే మృతి చెందాడు. కొత్తపల్లి పోలీసుల వివరాల ప్రకారం.. భూమయ్య తన ద్విచక్రవాహనంపై రేకుర్తికి వస్తున్నాడు. మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో జగిత్యాల నుంచి కరీంనగర్‌కు వస్తున్న కారు అతివేగంగా భూమయ్య బైక్‌ను వెనుకవైపు నుంచి ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన భూమయ్య మృతి చెందాడు. భూమయ్య భార్య ఫిర్యాదుతో కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరఖ్‌పూర్‌కు చెందిన రాజేష్‌గుప్తా(28) అనేవ్యక్తి పరిస్థితి విషమించి శనివారం మృతిచెందాడు. కరీంనగర్‌రూరల్ పోలీసుల వివరాల ప్రకారం.. రాజేష్‌గుప్తా రెండేళ్లుగా నగరంలోని కిసాన్‌నగర్‌లో నివాసం ఉంటూ కార్పెంటర్ వద్ద పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం బైక్‌పై కరీంనగర్ నుంచి వల్లంపహాడ్ గ్రామానికి వెళ్తున్నాడు. తీగలగుట్టపల్లి వద్ద కుక్కను తప్పించబోయి బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొంది. దీంతో రాజేష్‌గుప్తకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు. రాజేష్ గుప్తా బంధువు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని ఐకేపీ ఉద్యోగి మృతి



కుమారస్వామిగౌడ్(ఫైల్)

అంతర్గాం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద లారీఢీకొని ఐకేపీ ఉద్యోగి మేరుగు కుమార స్వామి గౌడ్ మృతిచెందాడు. పెద్దంపేట గ్రామానికి చెందిన మేరుగు కుమార స్వామిగౌడ్(43) ద్విచక్రవాహనం టీఎస్ 02ఈఈ 0265పై పాలకుర్తి మండలానికి విధులకు వెళుతున్నాడు. బసంతనగర్ నుంచి అంతర్గాం వైపు వేగంగా వెళుతున్న ఏపీ20టీబీ5994 నంబర్‌గల లారీ బ్రాహ్మణపల్లి మూలమలుపు వద్ద ఢీకొట్టడంతో కుమారస్వామికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనస్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖనిలోని ప్రభుత్వ ఏరియాఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య శైలజ, కూతురు, కుమారుడు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్టు ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు. మృతుడి కుటుంబానికి కోటి రూపాయల నష్ట పరిహారం చెల్లించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకుడు కౌశిక హరి, పెద్దంపేట గ్రామస్తులు రాస్తారోకో నిర్వహించారు. సంఘటన స్థలాన్ని సందర్శించిన బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, న్యూడెమోక్రసీ నాయకులు కొల్లూరి మల్లేష్, మేరుగు చంద్రయ్యలు మృతుడి కుటుంబీకులను ఓదార్చారు.

రైలు ఎక్కబోతూ రైల్వే ఉద్యోగి మృతి

జమ్మికుంట రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట రైల్వే స్టేషన్లో దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కబోతూ ప్రమాదవశాత్తు జారిపడి కొంరయ్య అనే రైల్వే ఉద్యోగి శనివారం మృత్యువాతపడ్డాడు. హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం సోమిడి గ్రామానికి చెందిన కొంరయ్య బిజిగిరిషరీఫ్ రైల్వేస్టేషన్ పరిధిలో గ్యాంగ్‌మేన్ విధులు నిర్వర్తిస్తున్నాడు. విధులు ముగించుకొని రైలు ఎక్కేందుకు జమ్మికుంటకు వచ్చాడు. దానాపూర్ ఎక్స్‌ప్రెస్ జనరల్‌బోగిలో ఎక్కుతున్న క్రమంలో కాలుజారి ప్లాట్‌ఫామ్ మీద పడి అక్కడికి అక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ గంగారపు తిరుపతి తెలిపారు.

ఎన్టీపీసీలో యువకుడి ఆత్మహత్య

జ్యోతినగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నపూర్ణకాలనీలో శనివారం దయా ప్రసన్నకుమార్(29) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యానుకు వైరుతో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. వ్యక్తిగత కారణాల వల్లనే జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.



దివ్యాంగులకు యూడీఐడీ స్మార్ట్‌కార్డులు

- అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకు చర్యలు
- వన్‌నేషన్, వన్‌డిసెబులిటీపై కేంద్రం కసరత్తు

సుభాష్‌నగర్, మార్చి11(ఆంధ్రజ్యోతి): వన్‌నేషన్, వన్ డిసెబులిటీలో భాగంగా దేశంలోని వికలాంగులందరికీ ఒకే రకమైన కార్డులు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం యూడీఐడీ కార్డులను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం వైకల్య నిర్ధారణకు సదరం సర్టిఫికెట్ ఇస్తున్నారు. దానికి కూడా కాలపరిమితి ఉటుంది. ఈ సమస్యలేవి లేకుండా యూడీఐడీ (యూనిక్ డిసెబిలిటీ ఐడీ) నంబరును కేటాయించి స్మార్టు కార్డులు జారీ చేయనున్నారు. ఇందుకు ప్రత్యేకంగా పోర్టల్‌ను ప్రారంభించి దివ్యాంగులే నేరుగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. సమగ్ర వివరాలతో పాటు పాస్‌పోర్టు సైజు ఫొటో, సంతకం లేదా ఆదార్ కార్డు తదితర గుర్తింపు కార్డులను పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి సదరం శిబిరం నిర్వహించే కేంద్రాల్లో దగ్గర ఉండే దానిని ఎంచుకోవాలి. అక్కడ ఏ రోజు సదరం నిర్వహిస్తారో మొబైల్ ఫోనుకు మెసేజ్ పంపిస్తారు. అక్కడికి వెళ్తే డాక్టర్లు వారి వైకల్యాన్ని నిర్ధారించి ఎంత శాతం ఉందనేది పోర్టల్‌లో నమోదు చేస్తారు. కొత్తవారితో పాటు ఇప్పటికే సదరం సర్టిఫికెట్ పొందిన వారికి కూడా స్మార్టు కార్డులు జారీ చేస్తారు. స్మార్ట్ కార్డుల కోసం మీసేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకొని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహించే సదరం శిబిరానికి హాజరు కావాల్సి ఉంటుంది. వివరాలన్నీ సరిగ్గా ఉన్నాయని డాక్టర్లు నిర్ధారించి స్మార్ట్ కార్డు మంజూరు చేస్తారు. డిజిటల్ సంతకంతో కూడిన స్మార్ట్ కార్డు పోస్టు ద్వారా దివ్యాంగుడి ఇంటి అడ్రస్‌కు పంపిస్తారు. కార్డులో ఐడీ నంబరు, దివ్యాంగుడి పేరు, వైకల్యం రకం, ఎంతశాతం ఉంది అనే వివరాలు అందులో ఉంటాయి.

● కార్డుతో బహుళ ప్రయోజనాలు

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న యూడీఐడీ కార్డుతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. సదరం శిబిరంలో వికలాంగత్వం నిర్ధారణ అయిన తర్వాత అర్హులైన వారికి అధికారులు కార్డు మంజూరు చేస్తారు. ఈ కార్డు ఆధార్‌తో లింక్ చేయబడి ఉండటంతో వికలాంగులకు కేంద్రం అందించే సంక్షేమ పథకాలు ఏ మేరకు అందుతున్నాయే పరిశీలించే అవకాశం ఉంటుంది. ఈ కార్డు బస్సులు, రైళ్ల టికెట్లపై రాయితీలు, పింఛన్ వంటి ప్రయోజనాలు పొందవచ్చు. దేశంలో ఎక్కడైనా ఈ కార్డుని ఉపయోగించుకోవచ్చు. వికలాంగుల సామాజిక, ఆర్థిక విషయాలు ఈ కార్డు ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుంది. వికలాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందే అన్ని పథకాలకు యూడీఐడీ కార్డు కీలకంగా మారనుంది.

స్వగ్రామానికి చేరుకున్న రంగపేటవాసి



మధుకర్‌రెడ్డి

మానకొండూర్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగపేటకు చెందిన మయన్మార్ బాధితుడు కొక్కిరాల మధుకర్‌రెడ్డి శనివారం స్వగ్రామానికి చేరుకున్నాడు. బాధితుడి అనుభవాలు ఆయన మాటల్లోనే.. మధుకర్‌రెడ్డి గత సంవత్సరం డిసెంబరు17న థాయ్‌లాండ్‌కి బతుకుదెరువు కోసం వెళ్లాడు. అక్కడి నుంచి మయన్మార్ దేశంలో ఉద్యోగం కల్పిస్తామని రాజశేఖర్ అనేవ్యక్తి తీసుకెళ్లాడు. రాజశేఖర్.. మధుకర్‌రెడ్డిని చైనాకు చెందిన ఓ కంపెనీకి అమ్మివేయడంతో మోసపోయాడు. ఇండియాకు చెందిన సుమారు వెయ్యి మంది అక్కడే ఉన్నారని కరీంనగర్ ఎంపీ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ చొరవతో నాతో పాటు 540మంది ఇండియాకు రాగా మరో 460మంది అక్కడే చిక్కిపోయారని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో దొంగతనం

● 23 ట్యాబ్‌ల అపహరణ ● సంఘటనా స్థలాన్ని సందర్శించిన రూరల్ ఏసీపీ



పగులకొట్టిన వెటిలేటర్‌ను పరిశీలిస్తున్న ఏసీపీ శుభం ప్రకాశ్

మానకొండూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు 23ట్యాబ్‌లను ఎత్తుకెళ్లిపోయారు. పీఎం శ్రీ(ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం కింద పాఠశాలకు ఇటీవల ఒకటి రూ.15వేల చొప్పున రూ.3.80లక్షలతో 25ట్యాబ్‌లను కేంద్రప్రభుత్వం మంజూరు చేసింది. శుక్రవారం హోలీ పండుగ కావడంతో పాఠశాలకు సెలవు ఉంది. దొంగలు మొదటగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడి గది వెనకాల ఉన్న వెంటిలేటర్‌ను పగులకొట్టి గదిలోకి దూరారు. ఆ గదిలోని ఓ బీరువాలో ఉన్న తాళాలు తీసుకొని దాని ప్రక్కన ఉన్న మరోగది వెనకాలకు వెళ్లి దాని వెంటిలేటర్‌ను పగులకొట్టి ఆ గదిలోకి దూరారు. మొదటి రూంలో నుంచి తెచ్చుకున్న తాళాల సహాయంతో బీరువాలో ఉన్న 23ట్యాబ్‌లను ఎత్తుకెళ్లారు. మరో రెండు ట్యాబ్‌లు హెచ్‌ఎం బీరువాలో ఉన్నాయి. శుక్రవారం హోలీ పండుగ కావడంతో శనివారం నుంచి ఒంటిపూట బడి ప్రారంభం అయింది. ఉదయం 7.30గంటలకు సిబ్బంది పాఠశాలకు రావడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ లక్ష్మీనారాయణ సంఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్‌తోపాటు క్లూస్ టీం సీఐ స్వర్ణజ్యోతి సమాచారమివ్వగా వారువచ్చి చోరీ జరిగిన తీరును పరిశీలించారు. రెండు గదులలోని బీరువాలు, తాళం చెవిలు, రెండు గదుల వెనకాల పగులకొట్టిన వెంటిలేటర్‌లను పరిశీలించారు. బీరువాలతోపాటు తాళం చెవిలు, గోడల వద్ద ఫింగర్ ప్రింట్‌లను సేకరించారు. అనంతరం పాఠశాల సిబ్బందితోపాటు ఉపాధ్యాయుల ఫింగర్ ప్రింట్‌లను సేకరించారు. పాఠశాలకు చెందిన విద్యార్థుల హస్తంతోనే దొంగతనం జరిగి ఉండవచ్చనే అనుమానాలు బలంగా ఉన్నాయి. రెండు, మూడు రోజుల్లో దొంగలు బయటపడే అవకాశాలు ఉన్నాయి. కాగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలు పట్టాల పక్కన యువజంట మృతదేహాలు

● ప్రేమ జంటగా అనుమానం ● ఘటనపై అనుమానాలు



రైల్వే ట్రాక్‌పై మృతదేహాలు

జమ్మికుంట,మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం బిజిగిరి షరీఫ్-పాపయ్యపల్లి గ్రామాల రైల్వేట్రాక్ మధ్య ఓ యువజంట అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నది. వారు ప్రేమ జంట అయి ఉండవచ్చని, గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మృతి చెందిన యువకుడు ఇల్లందకుంట మండలం రాచపల్లి గ్రామానికి చెందిన మెనుగు రాహుల్ (18)గా గుర్తించారు. ఇతను హైదరాబాద్‌లోని ఓ బేకరీలో పనిచేస్తున్నాడు. మూడు రోజుల క్రితం స్వగ్రామం రాచపల్లికి వచ్చాడు. శనివారం సాయంత్రం 4 గంటలకు ఇంట్లో నుంచి బయటికి వెళ్లాడు. ఫోన్ డిస్‌ప్లే ధ్వంసం కావడంతో యువతి వివరాలు తెలియరాలేదు. ప్రమాదంలో ఇద్దరి తలలకు మాత్రమే దెబ్బలు తగిలి ఉన్నాయి. ఒంటిపై ఎక్కడా గాయాలు లేవు. యువకుడి ముఖం కంకర రాళ్లలోకి చొచ్చుకుపోయి ఉంది. యువతి తలకు తీవ్రంగా గాయమైంది. ఒక సెల్‌ఫోన్ పక్కన పడి ఉండగా, మరొక సెల్ పూర్తిగా ధ్వంసం అయింది. మృతదేహాలు ఒక దగ్గర పడి ఉన్నాయి. రైలు కింద పడితే కొంత దూరం అయినా లాక్కు వెళ్లే అవకాశాలు ఉంటాయి. యువతి మెడకు చున్నీ చుట్టి ఉంది. దీంతో మృతిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. యువజంట రాత్రి వేళలో అటు వైపు ఎలా వచ్చారనేది తెలియాల్సి ఉంది. అటువైపు రావాలంటే పాపయ్యపల్లి గ్రామ రైల్వే క్యాబిన్ నుంచి రావాల్సి ఉంటుంది. ఏదైనా వాహనం మీద వచ్చినా అక్కడే పెట్టి నడుచుకుంటూ వచ్చి ఉండాలి. హత్యా.. ఆత్మహత్యా అనే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. రైల్వేపోలీస్‌లు కేసు నమోదు చేశారు.

ముచ్చటగా.. మూడోపెళ్లి..

● పెట్రోల్‌పోసి నిప్పటించిన మొదటి భార్య, కుమారులు
● చికిత్సపొందుతూ వ్యక్తి మృతి



కమలాకర్ (ఫైల్)

జగిత్యాలరూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని పొలాసగ్రామంలో పడాల కమలాకర్(60) అనేవ్యక్తి మూడో పెళ్లి చేసుకోగా మొదటి భార్య, కుమారులు పెట్రోల్‌పోసి శనివారం నిప్పంటించారు. తీవ్రంగా గాయపడిన కమలాకర్‌ను ఆస్పత్రికి తరలించగా శనివారంరాత్రి చికిత్సపొందుతూ మృతిచెందాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పడాల కమలాకర్ పొలాస గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. గతంలోనే కమలాకర్ రెండు పెళ్లిళ్లు చేసుకోగా ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. సంవత్సరంక్రితం కమలాకర్ మూడోపెళ్లి చేసుకొని గ్రామంలో మూడోభార్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో మొదటి భార్య, కుమారులను తరుచూ మద్యం తాగివచ్చి వేధించేవాడు. దీంతో కమలాకర్‌పై కోపం పెంచుకున్న మొదటి భార్య పడాల జమునతోపాటుకుమారులు పడాల చిరంజీవి, పడాల రంజిత్, కూతురు శిరీష, అల్లుడుశోభన్‌బాబు శనివారం ఉదయం కమలాకర్ నివాసం ఉంటున్న ఇంటికివెళ్లి గొడవ పడ్డారు. ఈక్రమంలో కమలాకర్‌పై కత్తులతో దాడిచేసి ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పటించారు. దీంతో తీవ్రంగా గాయపడిన కమలాకర్‌ను స్థానికులు జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. శరీరభాగాలు పూర్తిగా కాలిపోవడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు కమలాకర్ సోదరుడు పడాల రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సదాకర్ తెలిపారు.

నలుగురు గంజాయి విక్రేతల అరెస్టు

మెట్‌పల్లిటౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బీహార్ రాష్ట్రం నుంచి గంజాయి తీసుకొచ్చి మెట్‌పల్లి సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్న నలుగురు సభ్యులు గల ముఠాను అరెస్టు చేసి, వీరి వద్ద 450 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని పోలీసు సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎలిగేడు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): జూలపల్లి పోలీస్‌స్టేషన్‌పరిధిలోని ఎలిగేడులో పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని పట్టుకొని వారి రూ.6600నగదు, 3సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. హెచ్‌సి శాంతయ్య, కానిస్టేబుల్‌లు మనోహర్, పవన్ పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన యువకుడి అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పోలీసు విధులకు ఆటంకం కలిగించిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామానికిచెందిన యువకుడు గడ్డి నవీన్‌ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రమాకాంత్ శనివారం తెలిపారు. ఈ నెల14న రాత్రి రాచర్లగొల్లపల్లి బస్టాండు ప్రాంతంలో పండ్ల దుకాణ యజమాని హమీద్‌తో యువకుడు నవీన్ గొడవకు దిగాడని పేర్కొన్నారు. సమాచారం అందుకున్న హెడ్‌కానిస్టేబుల్‌శ్రీనివాస్‌రావు అక్కడకు చేరుకుని శాంతింపజేయడానికి ప్రయత్నిస్తే నవీన్ ఎదురుతిరగడంతోపాటు చేతులతో నెట్టివేశాడని వివరించారు. బ్లూకోల్ట్స్ విధులు నిర్వహిస్తున్న ఆసిఫొద్దిన్, నర్సింలుకు విషయం చెప్పడంతో చేరుకున్నారన్నారు. యువకుడు నవీన్‌ను శాంతింపజేసిన పట్టించుకోకుండా విధులకు ఆటంకం కలిగించడంతోపాటు తమను నెట్టివేశాడని హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్‌రావు ఫిర్యాదుతో కేసునమోదు చేశామని చెప్పారు. అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14రోజుల పాటు జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ రమాకాంత్ తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆటో

● పలువురు పదో తరగతి విద్యార్థులకు గాయాలు



చిన్నకలువల వద్ద లారీని ఢీ కొన్న విద్యార్థుల ఆటో

సుల్తానాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ నుంచి పెద్దపల్లి వెళుతున్న ఆటో రోడ్డుపై నిలిపి ఉన్న ఓ లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న సుల్తానాబాద్‌కు చెందిన ఓ ప్రైవేట్ స్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం సుల్తానాబాద్ పట్టణంలోని అల్ఫోర్స్ స్కూల్‌కు చెందిన పదోతరగతి విదార్థులు స్కూల్ ముగిసిన తర్వాత ఆటోలో పెద్దపల్లిలోని ఇండ్లకు వెలుతున్నారు. చిన్నకలువల వద్ద ఆటో అదుపు తప్పి రాజీవ్ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ సంఘటనలో పసునూటి సాయిచరణ్, అప్పాల అభిరామ్, రేవెల్ల ఆదిత్య, వినుకొండ విశాల్, గుండేటి వర్షిత్ అనే విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఆటోలో మొత్తం ఎనిమిది మంది విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. వీరంతా పెద్దపల్లికి చెందినవారే. సంఘటనా సమాచారం అందుకున్న పెద్దపల్లి ట్రాఫిక్ సీఐ అనిల్‌కుమార్, సుల్తానాబాద్ ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డవారిని పెద్దపల్లి ఆసపత్రికి తరలించారు. ప్రమాద వివరాలను నమోదు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

వేములవాడ టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన వేములవాడ మున్సిపల్‌పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామ శివారులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శాత్రాజుపల్లి గ్రామానికి చెందిన రేగుల హన్మంతు బైక్‌పై వేములవాడకు వెళుతున్నాడు. అదేక్రమంలో చెరుకుబండి ఎదురుగా వచ్చింది. ఈ రెండు ఎదురెదురగా ఢీకొట్టుకున్నాయి. ఈ సంఘటనలో హన్మంతుకు తీవ్రగాయాలు కాగా ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

చీరల ఉత్పత్తిలో వేగం పెంచాలి: టెక్స్‌కో జీఎం



మాట్లాడుతున్న టెక్స్‌కో జీఎం అశోక్‌రావు

సిరిసిల్ల రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్వశక్తిసంఘాల మహిళలకు పంపిణీ చేసేందుకు రాష్ట్రప్రభుత్వం ఇచ్చే చీరలఆర్డర్‌లను తీసుకుని ఉత్పత్తిలో వేగం పెంచడంతోపాటు సకాలంలో తయారుచేసి అందించాలని టెక్స్‌కో జనరల్ మేనేజర్ అశోక్‌రావు కోరారు. సిరిసిల్లలో శనివారం చీరల తయారీపై యాజమానులు, ఆసాములతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆసాముల, యాజమానులకు చీరలతయారీ ఆర్డర్‌కాపీలను అందించారు. ఈకార్యక్రమానికి హాజరైన జీఎంఅశోక్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం తయారు చేయిస్తున్న చీరలను నాణ్యతతో ఉండేలాచూసి సకాలంలో అందించాలన్నారు. వేములవాడలో ఏర్పాటుచేసిన యారన్ డిపో నుంచి చీరలకు సంబంధించిన యారన్‌నుతీసుకోవాలని సూచించారు. ఇక్కడి వస్త్ర పరిశ్రమల్లో నెలకొన్న సమస్యలను యాజమానులు, ఆసాములు జీఎంకు విన్నవించగా, సమస్యలను చేనేత జౌళిశాఖ కమిషనర్ దృష్టికితీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ సీజీఎం ఎన్‌వీ వెంకటరమణ, సిరిసిల్లఏడీరాఘవరావు పాల్గొన్నారు.

వేములవాడ రాజన్న ఆలయ ఉద్యోగి సస్పెన్షన్

వేములవాడ కల్చరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వర స్వామి ఆలయంలో గతంలో పీఆర్వోగా విధులు నిర్వర్తించిన చంద్రశేఖర్‌ను దేవదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి శనివారం తెలిపారు. రాజన్న ఆలయంలో 2016-17 సంవత్సరానికిగాను వివిధ టీవీ, దినపత్రికలకు ప్రకటనలు ఇవ్వడంలో భాగంగా రూ.28లక్షలలో కొంతమేర బిల్లులు లేకపోవడంతో అవినీతి జరిగినట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించారని, దాని ఆధారంగా సదరు ఉద్యోగిని సస్పెండ్‌చేస్తూ ఉత్తర్వులు వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం కొండగట్టులో విధులు నిర్వర్తిస్తుండటంతో అక్కడి ఈవోకు ఉత్తర్వులను పంపించినట్లు ఆలయ ఈవో పేర్కొన్నారు.

ఆలయ ప్రతిష్టను పెంచేలా విధులు నిర్వర్తించాలి: ఈవో

వేములవాడ కల్చరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి వచ్చే భక్తులతో కాంట్రాక్టర్‌లు, ఉద్యోగులు సత్ప్రవర్తనగా వ్యవహరించాలని, భక్తులతో మర్యాదపూర్వకంగా ఉంటూ ఆలయ ప్రతిష్ఠతను పెంచేలా విధులు నిర్వర్తించాలని ఈవో వినోద్‌రెడ్డి అన్నారు. రాజన్న ఆలయంలోని పలు విభాగాలను శనివారం తనిఖీ చేశారు. రాజన్న ఆలయముందు భాగంలో కొబ్బరికాయలు, బెల్లం దుకాణాన్ని పరిశీలించారు. బెల్లం దుకాణాల్లోని రికార్డులను పరిశీలించి బెల్లం నాణ్యతను, తూకాన్ని పరిశీలించారు. రాజన్న భక్తులను మోసం చేస్తే ఊరుకునేది లేదని అన్నారు. కొబ్బరికాయలు కొట్టేవద్ద అపరిశుభ్రంగా కనిపించడంతో వాటిని వెంటనే తొలగించాలని, ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఏఈవోలు శ్రావణ్‌కుమార్, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, సీనియరల్‌అసిస్టెంట్ కూరగాయల శ్రీనివాస్, ఎఫ్‌సీఎఫ్‌అధికారి కరణ్‌సింగ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఉగ్ర నారసింహుడి డోలోత్సవం


ఉగ్ర నారసింహుని డోలోత్సవం

ధర్మపురి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని బ్రహ్మ పుష్కరిణి (కోనేరు)లో ఉగ్రనారసింహస్వామి తెప్పోత్సవం, డోలోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆస్థాన వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేదబ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య స్వామివారల ఉత్సవమూర్తులను సేవలపై ఉంచి బ్రహ్మ పుష్కరిణికి తీసుకువచ్చారు. అనంతరం హంసవాహన రూపంలోని పడవపై స్వామివారలను కూర్చో బెట్టి, బ్రహ్మపుష్కరిణిలో ఐదుసార్లు ప్రదక్షిణలు చేయించారు. భక్తులు నరసింహ నామస్మరణలు చేస్తూ మెట్లపైన ప్రదక్షిణలు చేయగా కొందరుమహిళలు త్రిశూలం చేతబట్టుకుని పూనకాలతో స్వామివారలను కొలుస్తుండగా అర్చకులు తెప్పోత్సవం జరిపారు. అనంతరం స్వామివారల సేవలను బ్రహ్మపుష్కరిణిమధ్య గల మండపంలోని ఊయలపై ఆసీనులను చేశారు. సనాతన సాంప్రదాయరీతిలో అర్చకులు స్వామివారల డోలోత్సవం నిర్వహించారు. భక్తులు వెళ్లి స్వామివారలపై బుకాగులాలు చల్లి కట్నకానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన భక్తులు డోలోత్సవం తిలకించిన అనంతరం నెత్తిమీద ముల్లెమూట పెట్టుకుని తిరుగు ప్రయాణం పట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ఉదయ్‌కుమార్, శ్రీధర్, ఉమాసాగర్, సతీష్, దత్తాత్రి, కుమారస్వామి, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.


ఉగ్ర నారసింహుని తెప్పోత్సవం

హలీం.. సలాం..

- సర్వజనులకు ఎంతో ప్రియం..
- రంజాన్ మాసం.. నోరూరించే రుచులు
- అరబ్ దేశాల నుంచి తెలంగాణకు..
- జిల్లా ప్రధాన కూడళ్లలో ప్రత్యేక స్టాళ్లు
- అదివారం ప్రత్యేకం



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

రంజాన్ మాసం వచ్చిందంటే ఎక్కడ చూసినా హలీమ్ ఘుమఘు మలు నోరూరిస్తాయి. ముస్లింలే కాదు సర్వజనులకు హలీమ్ ఎంతో ప్రియమైనదిగా భావిస్తారు. వీటితో పాటు రంజాన్ సందర్భంగా తయారుచేసే వంటకాల కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కూడళ్లలో కేంద్రాలను నిర్వహిస్తున్నారు. పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం నుంచే హలీమ్ రుచులతో పాటు చికెన్ మంచూరియా, చికెన్ కర్రీ, తందూరి చికెన్, డబుల్‌కా మీఠా, రుమాల్ రోటి వంటి రుచులను నిర్వాహకులు అందిస్తున్నారు. రంజాన్ సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

● హైదరాబాద్ నుంచి చిన్న నగరాలకు రంజాన్ రుచులు..

ఒకప్పుడు హైదరాబాద్‌కే పరిమితమైన హలీమ్ ఇప్పుడు చిన్న చిన్న నగరాల్లో సైతం లభిస్తోంది. ఇప్పటికీ రుచికరమైన హలీమ్‌కు మన హైదరాబాదే ప్రసిద్ధిగాంచింది. రుచుల పరంగా కాకుండా కేలరీల పరంగా కూడా హలీమ్ ఎంతో ముఖ్యంగా చెప్పుకుంటారు. రోజా రోజుల్లో అందే రుచుల్లో ముఖ్యంగా ఉండే హలీమ్ అరబ్ దేశాల నుంచి తెలంగాణకు వచ్చి వందేళ్లు పూర్తి చేసుకుంది. మారుతున్న ప్రజల ఆహార అలవాట్లకు అనుగుణంగానే హలీమ్‌ను కూడా రకరకాల వెరైటీలతో హోటల్ యజమానులు తయారు చేస్తున్నారు. 1866-1911 మధ్య కాలంలో నాటి నిజాం నవాబు తమ వంటశాలలో దీనిని ప్రత్యేకంగా తయారుచేయించి అతిథులకు వడ్డించేవారని చరిత్ర చెబుతోంది. హలీమ్ విక్రయ కేంద్రాలు మాత్రం 50 ఏళ్ల క్రితం మాత్రమే మొదలయ్యాయి.

హలీమ్ చరిత్రలోకి వెళితే...

వంద సంవత్సరాల క్రితం నిజాం రాజు తన వ్యక్తిగత సైన్యం కోసం యెమెన్, సౌదీ, అరబ్ దేశాల నుంచి రక్షక భటులను తెప్పించుకునేవారు. వారు ఇక్కడికి వచ్చిన తరువాత రోజూవారి ఆహారం కాకుండా ప్రత్యేకంగా తయారు చేయడానికి వంట మనుషులు కూడా వచ్చారు. వచ్చిన వారు సైనికులు ఎక్కువసేపు ఆహారం లేకుండా ఉండేందుకు గోధుమలు, నెయ్యి, మాంసంతో ఒక పదార్థాన్ని తయారుచేసేవారు. దానిని అప్పుడు హరీస్‌గా పిలిచేవారు. స్వచ్ఛమైన గోధుమలు, నెయ్యి, మాంసాన్ని సమభాగంలో ఉడికించి తినేవారు. కాలానుగుణంగా ఇక్కడే ఉండిపోయిన అరబ్బులు, నిజాం పండుగ వేడుకల్లో కూడా హరీస్‌ను తయారు చేయించి వడ్డించేవారు. నిజాం రాజ వంశీకుల ఇండ్లతో పాటు ప్రస్తుతం దేశవ్యాప్తంగా హరీస్, హలీమ్ వంటకాలు ప్రసిద్ధి చెందాయి.

● వెజిటేరియన్ హలీమ్...

శాఖాహారులకు కూడా వెజిటేరియన్ హలీమ్ అందుబాటులోకి తెచ్చారు. ఫిష్ హలీమ్ తయారు చేసే విధానంలోనే దీనిని తయారు చేస్తారు. గోధుమరవ్వతో పాటు కొద్దిపాటి మసాలాను వినియోగిస్తారు. వండిన తరువాత చివరలో బీన్స్, క్యారెట్, కీరా, పచ్చి బఠానీలు కలిపి ఉడికిస్తారు. ఘాటుగా ఉండకుండా పెరుగుతో పాటు పాలు కలుపుతారు.

● జాఫ్రానీ హలీమ్...

జాఫ్రానీ హలీమ్‌లో గోధుమలు, మాంసం, నెయ్యితో పాటు కుంకుమపువ్వు వాడుతారు. దీంతో ఇది సుగంధం వెదజల్లుతుంది. అవసరమయిన వాళ్లు దీనిని ప్రత్యేకంగా తయారు చేయించుకుంటారు. ఎక్కువగా తింటే వేడి చేసే అవకాశం ఉంది.

● దక్కన్ హలీమ్...

నిజాం కాలంలో అరబ్బులు తయారు చేసే హలీమ్‌ను దక్కన్, దక్కని పేర్లతో పిలిచేవారు. ఇందులో గోధుమలతో పాటు మాంసం మోతాదు రెండు నుంచి మూడింతలు వేస్తారు. గరం మసాలాతో పాటు లవంగం, ఇలాచీ, పప్పుదినుసులు కలిపి దీనిని తయారు చేస్తారు.

● ఇరానీ హలీమ్...

పాతకాలం వారు ఇప్పటికీ ఇరానీ హలీమ్ తయారుచేస్తున్నారు. ఇరానీ హలీమ్ ఘాటుగా ఉండదు. డ్రై ఫ్రూట్స్‌తో పాటు గోధుమలు, మినప పప్పు, తక్కువ మోతాదులో మసాలా దినుసులు వినియోగిస్తారు. ఈ హలీమ్ ఎక్కువగా పేస్ట్‌లా కాకుండా చిన్నచిన్న గింజలుగా ఉంటుంది.

● మటన్ హలీమ్...

గోధుమలు, మటన్‌తో పాటు శనగపప్పు, మినప పప్పు, ఎర్రపప్పు కలిపి తయారు చేస్తారు. మసాలా దినుసులు కలిపి ఘాటుగా తయారు చేస్తారు.

● మరెన్నో ఘుమఘుమలు

రంజాన్ పర్వదినాల్లో హలీమ్, హరీస్, రుచులతో పాటు మరెన్నో వంటకాలు ఘుమఘుమలాడుతాయి. దమ్ బిర్యానీతో పాటు డబుల్‌కా మీఠా, కబాబ్, సేమియా, కుర్బానీకా మీఠా, చికెన్ టిక్కాలు, తందూరి చికెన్, రుమాలీ రోటీ, రుచులను అందిస్తారు.

20 ఏళ్లుగా హలీమ్ చేస్తున్నాను...
- ఎస్‌కే తౌఫిక్, మాస్టర్



రంజాన్ మాసంలో అందరికీ ఇష్టమైన హలీమ్, హరీష్‌తో పాటు బుల్‌కా మీఠా, కబాబ్, సేమియా, కుర్బానీకా మీఠా, చికెన్ టిక్కాలు, తందూరి చికెన్ తయారుచేస్తాను. దాదాపు 20 ఏళ్లుగా హలీమ్ తయారు చేస్తున్నాను. అందరూ బాగా ఇష్టపడుతారు.

ప్రతి రంజాన్‌కు స్టాల్ ఏర్పాటు..
- ముజీబ్, నిర్వాహకుడు



ప్రతి రంజాన్ మాసంలో హలీమ్, హరీష్ ఇతర పదార్థాలను అందించడానికి స్టాల్ నిర్వహిస్తున్నాను. అందరు ఎక్కువగా హలీమ్, హరీస్, పిల్లలు తందూరి చికెన్ ఇష్ట పడుతారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు

- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌పై
కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్


మాట్లాడుతున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీనుంచి మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌తో కాంగ్రెస్, బీఆర్ఎస్‌డ్రామాలు ఆడుతున్నాయని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. శనివారం నగరంలోని టీఎన్‌జీవో హాలులో విలేకరులతో మాట్లాడారు. ప్రజల దృష్టిని మళ్లించడానికి జగదీష్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్‌చేసి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. కాంగ్రెస్,బీఆర్ఎస్ రెండుపార్టీలు ఎమ్మెల్సీఎన్నికల్లో బీజేపీ గెలుపును జీర్ణించుకోలేక పోయాయని, కొత్త ఎత్తుగడులు వేస్తున్నాయని అన్నారు. రాష్ట్రప్రభుత్వం ఆరుగ్యారంటీలను అమలు చేయడంలేదన్నారు. కేంద్రం స్మార్ట్‌సిటీ నిధులు మంజూరు చేస్తే రాష్ట్రవాటా ఇవ్వడం లేదన్నారు. రాజాసింగ్ వ్యాఖ్యలను తాను వినలేదని, బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే రహస్యభేటీలు జరుగుతున్నాయని, ఆ రెండుపార్టీలు ఒక్కటేనని అన్నారు. ఆరుగ్యారంటీలపైనా ప్రజాసమస్యలపైనా చర్చించే దమ్ముందా? అని ప్రశ్నించారు. పది లక్షలఎకరాలు పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వానికి పట్టింపులేదన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చినహామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రుణమాఫీ, రైతుభరోసా, నిరుద్యోగభృతి, ఉద్యోగుల డీఏ, వృద్ధులకు రూ.4 వేల పింఛన్, కల్యాణలక్ష్మి తులం బంగారం, మహిళలకు నెలకు రూ.2500, కాంట్రాక్టర్లు, మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు వంటి వాటి ఊసేలేదన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, కేసీఆర్ ప్రభుత్వానికి దించి వేశారని, కాంగ్రెస్‌కు అదే గతిపడుతుందని అన్నారు. తమిళనాడులో డీఎంకేపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, అందుకే డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం చేస్తున్నారని, డ్రామాలు మొదలు పెట్టారని అన్నారు. తెలంగాణతోపాటు కర్నాటకలో కాంగ్రెస్ పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. కేరళలో పరిస్థితి అలాగే ఉందన్నారు. ఆయా పార్టీలన్నీ కలిసి బీజేపీని దెబ్బతీసేందుకు చూస్తున్నాయన్నారు. హైదరాబాద్‌లో మిస్‌వరల్డ్, తబ్లిగీ జమాతే సంస్థల సమావేశాల పేరుతో కోట్లుఖర్చు చేస్తున్నారన్నారని, ఇవి చేస్తే హైదరాబాద్ బ్రాండ్‌పెరుగుతుందా? అని ప్రశ్నించారు. తెలంగాణలో హైదరాబాద్‌తో సహా డ్రగ్స్‌తో పిల్లలు అల్లాడుతున్నారన్నారు. డ్రగ్స్ దందాచేసే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని, పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చి వాటిపై ఉక్కుపాదం మోపాలని అన్నారు. డ్రగ్స్ విక్రయాలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. డ్రగ్స్ కేసుపై విచారణ లేదని, ఫోన్‌ట్యాపింగ్‌పై కేసీఆర్ పాత్ర ఉందని తెలిసినా ఎందుకు అరెస్టు చేయలేదని అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ వద్ద ఉన్న వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను అమ్ముకోవాలని చూస్తున్నారన్నారు. సమావేశంలో మాజీఎమ్మెల్యే బొడిగె శోభ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడికృష్ణారెడ్డి, మాజీమేయర్ సునీల్‌రావు, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రుక్మిణీశ్రీకృష్ణుల కల్యాణం

కాల్వశ్రీరాంపూర్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో శనివారం శ్రీకృష్ణ ఆలయంలో రుక్మిణీసమేత శ్రీకృష్ణ కల్యాణాన్ని యాదవ సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఆరాధన, అభిషేకం,ఎదుర్కోలుమహోత్సవం, హోమం, సామూహిక కుంకుమపూజలు నిర్వహించారు. స్వామివారికి అల్లంల దేవేందర్‌స్వప్న, అల్లం కుమార్ కోమల దంపతులు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య రుక్మిణీశ్రీకృష్ణ కల్యాణం నిర్వహించగా తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. వ్యవసాయమార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, మాజీఎంపీపీలు గోపగోని సారయ్యగౌడ్, నూనేటిసంపత్, మాజీ జడ్పీటీసీలు తిరుపతిరెడ్డి, రాములు, జూకం టి శిరీష, కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు సదయ్య, అర్చకులు అనంత శ్రీరాములశర్మ, నిఖిల్ శర్మ, లిఖిల్‌శర్మ, యాదవసంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.


కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

ఘనంగా వేంకటేశ్వర స్వామి రథోత్సవం


వేంకటేశ్వర స్వామి రథోత్సవంలో పాల్గొన్న ప్రజలు

ధర్మారం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): దొంగతుర్తి గ్రామంలోని లక్ష్మీగోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలంలోనివివిధ గ్రామాలతోపాటు ఉమ్మడి కరీంనగర్‌జిల్లా నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. జాతీయ ఎస్సీకమిషన్ సభ్యులు వడ్డేపల్లిరామచంద్రం స్వామితోపాటు నందిమేడారం ప్యాక్స్‌చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 10నుంచి మొదలైన బ్రహ్మోత్సవాలు శనివారం రథోత్సవంతో ముగిశాయి.

కొండగట్టు అంజన్న సన్నిధిలో భక్తుల రద్దీ

మల్యాల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో రద్దీగా మారింది. వేకువజాము నుంచే తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముని ఆలయంలో పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.


క్యూలో వస్తున్న అంజన్న భక్తులు

తలనీలాల ద్వారా
రూ.1.46కోట్ల ఆదాయం..

మల్యాల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): గతంలో కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం ద్వారా సేకరించిన తలనీలాల ద్వారా దేవస్థానానికి రూ.1.46కోట్ల ఆదాయం సమకూరింది. 2023 ఆగస్టు నుంచి 2024 జూలై వరకు తలనీలాల సేకరణ టెండర్ ఖరారు కాకపోవడంతో దేవస్థానం తరుపున తలనీలాలు సేకరించగా వాటికి గాను అధికారులు ఈ ఏడాది జనవరిలో టెండర్లు నిర్వహించారు. ఇందులో కిలోకి రూ.10,300 చొప్పున హెచ్చు పాటదారు అయిన హైదరాబాద్‌కు చెందిన మదర్ హ్యూమన్ హేర్స్‌కు శనివారం అప్పగించారు. దీంతో దేవస్థానానికి రూ.1,46,48,866 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు చంద్రశేఖర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శివకల్యాణోత్సవం

- రాజన్న ఆలయంలో ఐదు రోజులపాటు నిర్వహణ

వేములవాడ కల్చరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నుంచిశివ కల్యాణ వేడుకలు ప్రారంభం కానున్నాయి. మహాశివరాత్రి పర్వదినం రోజున శ్రీపార్వతి పరమేశ్వరుల కల్యాణం నిర్వహించాల్సి ఉంటుంది. అయితే రాజన్నక్షేత్రంలో మాత్రం 60యేళ్లుగా అనాధిగా వస్తున్న సంప్రదాయంతో శివమహాపురాణం, లింగ పురాణం ఆధారంగా మన్మథుడి దహనంతో ఉత్సవాలు పూర్తైన తరువాత శ్రీపార్వతి పరమేశ్వరుల కల్యాణ వేడుకలు ప్రారంభమవుతాయని అర్చకులు వివరించారు. ఈనెల16నుంచి 20వరకు అంగరంగ వైభవంగా కళ్యాణాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

● సోమవారం రాజన్న కల్యాణం..

శివకల్యాణ వేడుకల్లో భాగంగా ఈనెల 17వ తేదిన సోమవారం రోజున ఉదయం 10.40 గంటల నుంచి 12.55 గంటల వరకు రాజన్న ఆలయ ఆవరణలోని గెస్ట్ హౌస్ ముందు ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై కల్యాణ వైభవాన్ని నిర్వహిస్తారు. 19వ తేది బుధవారం సాయంత్రం 3.05గంటలకు స్వామివారి రథోత్సవం కన్నుల పండవగా నిర్వహించనున్నారు. 20వ తేది గురువారం రోజున ఉదయం పూర్ణహుతి అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి ఏకాంత సేవ పూజాకార్యక్రమాలతో వేడుకలు ముగియనున్నాయి.

● భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు..

రాజన్న ఆలయంలో నిర్వహించే శివ కళ్యాణోత్సవానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరానున్నారని రాజన్న ఆలయఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చలువ పందిళ్లను ఏర్పాటు చేశామని, భక్తుల సౌకర్యార్థం గ్యాలరీలను ఏర్పాటు చేస్తున్నామని, వేసవికాలం కావడంతో తాగునీరు, మజ్జిగప్యాకెట్లు, మధ్యాహ్నం భోజనసౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి


జగిత్యాలలో మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రవి

జగిత్యాల అగ్రికల్చర్/సిరిసిల్ల రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి, ఉద్యోగులపై ప్రభుత్వ విశ్వసనీయతను చాటుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్రఅధ్యక్షుడు చావ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కమిటీ సమావేశాలు జగిత్యాల, సిరిసిల్లలో జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సెలవు జీతాలు, సప్లిమెంటరీ వేతనాలు, మెడికల్ బిల్లులు, జీపీఎఫ్, పెన్షన్, టీఎస్ జీఎల్ఐ తదితర బిల్లులు విడుదల కాకపోవడంతో ఉద్యోగులు, గత సంవత్సరం మార్చి నుంచి రిటైర్ అయిన ఉద్యోగులకు గ్రాట్యూటీ, కమ్యూటేషన్ మొత్తాలను చెల్లించకపోవడంతో పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బకాయిలు పడిన నాలుగు వాయిదాల డీఏలను వెంటనే చెల్లించాలని, పీఆర్సీ నివేదికను తెప్పించి ఉద్యోగ సంఘాలతో చర్చించి తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ 317జీవో బాధితులకు న్యాయం చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని రాష్ట్రంలో అన్ని జిల్లాలకు డీఈవోలను, మండలాలను ఎంఈవోల పోస్టులు మంజూరు చేయాలన్నారు. నెలాకరులోపు సమస్యలు పరిష్కరించకుంటే ఏప్రిల్‌లో తెలంగాణఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమాలకు కార్యాచరణ నిర్వహిస్తామని హెచ్చరించారు. అంతకుముందు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి భూమేశ్వర్‌పై మీడియాలో వచ్చిన అసత్య వార్తను జిల్లా కమిటీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని, తప్పుడు ఆరోపణలతో వేదింపులకు గురిచేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్రప్రధాన కార్యదర్శి వెంకట్, కార్యదర్శి గోల్కొండ శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు శ్యామ్, ప్రధాన కార్యదర్శి భూమేశ్వర్, శ్రీనివాస్, సుశీల, ఆగమయ్య, ప్రసాద్, శ్రీధర్, శ్రీనివాస్‌గౌడ్, స్వర్ణలత, గోపి, జయంత్, సిరిసిల్లలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిటి రాజు, సీనియర్‌నాయకులు పాకాల శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు మహేందర్‌రావు, కోశాధికారి అంబటి రమేష్, జిల్లా కార్యదర్శి పోలాస మల్లేశం, మధుసూధన్ తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా ప్రదర్శనలు..

- రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపేడేలా ప్రదర్శనలు ఉండాలని రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అన్నారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో ఐదు రోజుల పాటు నిర్వహించే శివకల్యాణోత్సవాలను పురస్కరించుకుని శనివారం నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా కళాకారులు తమ ప్రదర్శనలు చేయాలని సూచించారు.

భక్తులను అలరించిన మాయాబజార్ ప్రదర్శన..

వేములవాడ రాజన్న ఆలయంలోని ఓపెన్ స్లాబ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపైన ఏర్పాటు చేసిన మాయాబజాం నృత్యప్రదర్శన భక్తులను అలరించింది. హైదరాబాద్‌కు చెందిన వినాయక నాట్యమండలి సురభి శ్రీదినకరు ఆధ్వర్యంలో నిర్వహించారు.


కళాకారుల మాయాబజార్ ప్రదర్శన

విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ సత్యప్రసాద్ - జిల్లాలోని పలు పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) బోధన తరగతులు ప్రారంభం

జగిత్యాలరూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ సత్యకుమార్ అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలంలోని జాబితాపూర్ గ్రామంలోని ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా విద్యా బోధనను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు సులభతర విద్యాబోధన అందించేందుకు ఏఐ ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు కంప్యూటర్‌లో చేస్తున్న తెలుగు, ఇంగ్లీషుకు సంబంధించిన ప్రమాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో డీఈవో రాము, ఆర్డీవో మధుసూదన్, ఆకాడమిక్ మానిటరింగ్ అధికారి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● జగిత్యాల మండలం ధరూర్ జడ్పీహెస్ఎస్ పాఠశాలలో ఏఐ ద్వారా విద్యాబోధనను జగిత్యాల మండల విద్యాధికారి భీమయ్య ప్రారంభించారు.



మెట్‌పల్లి మండలం మేడిపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో ఏఐ తరగతులు ప్రారంభిస్తున్న ఎమ్‌ఈవో చంద్రశేఖర్, ఉపాధ్యాయులు

మెట్‌పల్లి రూరల్: మండలంలోని మేడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఏఐ తరగతులను మండల విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్ స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. వేంపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, మెట్‌పల్లి ఏఎంసీ డైరెక్టర్లు గోరుమంతుల ప్రవీణ్, పల్లి శేఖర్‌గౌడ్‌లు పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు పీసు రాజేందర్‌రెడ్డి, మల్లిఖార్జున్, బద్దం రాజారెడ్డి, తరి విక్రమ్, జిన్నా శ్రీకాంత్, లక్ష్మి, రమ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండలంలోని కొత్తధాంరాజుపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏఐ బోధనను మండల విద్యాధికారి దామోదర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని సిరికొండ ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో లోకిని శ్రీనివాస్ ప్రారంభించారు. బొమ్మెన, తక్కళ్లపల్లి ప్రాథమిక పాఠశాలల్లో కూడా ఏఐ బోధన ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టినట్టు ఎంఈవో తెలిపారు. ప్రధానోపాధ్యాయులు విష్ణు, వనతడుపుల రవికుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

గొల్లపల్లి: మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏఐ తరగతులను జిల్లా విద్యాధికారి రాము ప్రారంభించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి జమున, సెక్టోరియల్ ఆధికారి కొక్కుల రాజేష్, చిప్ప సత్యనారాయణ, ఎం చంద్రకళ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్/ ఇబ్రహీంపట్నం: కోరుట్ల మండల మోహన్‌రావుపేట ఇబ్రహీపట్నం మండలం ఎర్దండి, తిమ్మాపూర్ ఎంపీపీస్ పాఠశాలలో విద్యార్థులకు ఏఐ బోధన శిక్షణ తరగతులను ఇబ్రహీపట్నం మండల విద్యాధికారి బండారి మధు, మోహన్‌రావుపేట కాంప్లెక్ ప్రధానోపాధ్యాయుడు అనంద్ రావుల ప్రారంభించారు. మోహన్‌రావుపేటలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషన్, ప్రాథమిక ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయులు శివ, ఇబ్రహీపట్నంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, భూపతి, ఉపాధ్యాయులు విజయ్ లక్ష్మి, నికిత్, తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ దేవేందర్, మాజీ ఎంపీటీసీ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని ఆలూరు ప్రాథమిక పాఠశాలలో శనివారం ఎఫ్ఎల్ఎన్‌లో సి గ్రేడ్ వచ్చిన విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) ద్వారా విద్యాబోధనను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ నాయకుడు మెక్కొండ రాంరెడ్డి, విద్యాభివృద్ధి కమిటీ చైర్మన్ చిలుక సంజీవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అక్కినపల్లి సతీష్, ఉపాధ్యాయులు సాయి కృష్ణ, రమేష్ రెడ్డి, శృతి పాల్గొన్నారు.

బుగ్గారం: మండలంలోని మద్దునూర్ పాఠశాలలో ఏఐ బోధన తరగతులను మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుకర్ రావు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేష్, సీఆర్పీ పురుషోత్తం, మాజీ సర్పంచ్ తిరుపతి, మధుసూదన్, ఉపాధ్యాయులు రవీంద్రనాథ్, సతీష్ కుమార్, కొమరయ్య, సుజాత, శంకరయ్య, లలిత, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

జింక పిల్లకు ప్రథమ చికిత్స

కొడిమ్యాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అటవీ గ్రామమైన బొల్లోని చెరువు గ్రామంలో శనివారం అటవీ డిప్యూటీ రేంజర్ ముషీర్‌ఆహ్మద్ ఆధ్వర్యంలో సిబ్బంది అటవీ పరిశీలనకు వెల్లగా అస్వస్థతకు గురైన జింక పిల్ల కనిపించింది. దీంతో జింక పిల్లను సిబ్బంది పట్టుకొని ప్రథమ చికిత్స చేయించి కరీంనగర్ డీర్ పార్కుకు తరలించారు. డిప్యూటీ రేంజర్ వెంట బీట్ అధికారి అశ్విని, వాచర్ బాల రాజు ఉన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

బుగ్గారం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మద్దునూర్ గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్సై శ్రీధర్ శనివారం ప్రారంభించారు. ఈ సందదర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అన్నిరంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు సందీప్, అజయ్, శ్యాంరావు, మహేష్, వినోద్, తిరుపతిరెడ్డి, హరామారావు, సతీష్ రావు, గాలిపెల్లి మహేష్, సురేందర్‌రావు, తిరుపతి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

రాయికల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లిలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రాయికల్ పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాల విద్యార్థి పస్తం విష్ణు ప్రతిబ కనబరిచాడు. 100 మీటర్ల పరుగు పందెంలో అద్భుత ప్రతిభ కనబరిచి ఈ నెల 23న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. విష్ణును పాఠశాల ప్రిన్సిపాల్ బాలె శేఖర్, కరస్పాండెంట్ జయశ్రీ, అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్, పీఈటీ మహేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

భవిత కేంద్రాలకు భరోసా

(3వ పేజీ తరువాయి)

బీరువాలు తది తర సామగ్రిని అందిస్తారు. వీటి కొనుగోలు, విని యోగంపై మార్గనిర్దేశం చేశారు. వీటి ద్వారా ప్రత్యేక అవస రాలు గల విద్యార్థులకు బోధన, చికిత్స అందిస్తారు.

ఉద్యోగాలు క్రమబద్ధీకరణకు నోచుకోక..

సమగ్ర శిక్షలో 20 ఏళ్లుగా పనిచేస్తున్న ఐఈఆర్‌పీ (ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్‌పర్సన్)లు తమ పోస్టు ల క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూపులతో గడుపుతు న్నారు. ప్రభుత్వ భవిత కేంద్రాల్లో దివ్యాంగ పిల్లలకు పాఠాలు బోధిస్తూ ముందుకెళ్తున్న సంబంధిత ప్రత్యేక ఉపాధ్యాయులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భవిత కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తున్న 996 మంది ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మండలానికి ఒక్కరు, కొన్ని చోట్ల ఇద్దరు చొప్పున 28 మంది ప్రత్యేక ఉపా ధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. స్పెషల్ బీఈడీ, డీఈడీ అర్హత కలిగిన వీరిని ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా పోటీ పరీక్ష రాసి రోస్టర్ కమ్ రిజర్వేషన్ పద్ధతిలో అప్పటి ప్రభుత్వం నియమించింది. రూ. 19,350 జీతంతో వారు విధులు నిర్వర్తిస్తున్నారు. అన్ని అర్హతలున్నా ప్రభుత్వం క్రమబద్ధీకరించడం లేదని వారు వాపోతున్నారు. ప్రత్యేకంగా తయారు చేసిన పాఠ్యపుస్తకాలు, ఆట బొమ్మలు, వివిధ రకాల వస్తువులతో భవిత కేంద్రాల్లో బోధిస్తున్న వీరి భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. రాష్ట్రంలో సుమారు 30 వేలమందికి పైగా ప్రత్యేకావసరాలు గల దివ్యాంగ చిన్నారులు ఉన్నారు. వీరంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. వైకల్యంతో బాధపడేవారికి రెగ్యులర్ టీచర్లు బోధించే పాఠాలు సరిపోవు. వీరికి సుశిక్షితులైన టీచర్లే బోధించాలని సుప్రీంకోర్టు గతంలోనే తీర్పునిచ్చింది. 10 మంది విద్యార్థులుంటే ప్రత్యేకంగా టీచర్లను నియమించాలని సూచించింది.

గ్రూప్స్ ఫలితాల్లో సత్తాచాటిన బీర్‌పూర్ యువకుడు



రాజశేఖర్

బీర్‌పూర్,మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన గ్రూప్-2, గ్రూప్-3 ఫలితాల్లో బీర్‌పూర్ గ్రామానికి చెందిన చిర్నేని రాజశేఖర్ అనే యువకుడు సత్తాచాటాడు. బీర్‌పూర్ మండలకేంద్రానికి చెందిన చిర్నేని రాజవ్వ-చంద్రయ్య దంపతులు కుమారుడు చిర్నేని రాజశేఖర్ ఇటీవల విడుదలైన గ్రూప్-2 ఫలితాల్లో 287 ర్యాంక్, గ్రూప్-3 ఫలితాల్లో 86 ర్యాంక్ సాధించాడు. రాజశేఖర్ గతంలో రైల్వేలో ఉద్యోగం, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించగా, ప్రస్తుతం ఆర్మూర్ డిగ్రీ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

● **సండ్రల్లపల్లి యువకుడు..**



తిరుపతి

కొడిమ్యాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిర్మలాపూర్ అనుబంధ గ్రామమైన సండ్రల్లపల్లి గ్రామానికి చెందిన అర్గం తిరుపతి టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-3 పరీక్షలో రాష్ట్రస్థాయిలో 248వ ర్యాంక్ సాధించాడు. తిరుపతి ఇప్పటి వరకు రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. గతంలో సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్స్‌లో ఉద్యోగం సాధించాడు. తర్వాత తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్ 4ఫలితాల్లో విజయం సాధించి రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. గ్రూప్- 2 ఫలితాల్లో 572 ర్యాంక్ సాధించాడు.

మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న సుగుణ

జగిత్యాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ సర్కారు ప్రత్యేక కృషి చేస్తోందని మహిళా కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు సుగుణ అన్నారు. శనివారం పట్టణంలోని ఇందిరాభవన్‌లో మహిళా కాంగ్రెస్ జిల్లా బాధ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పార్టీ సభ్యత్వ నమోదు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈసందర్భంగా ఆమే మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి మహిళా పక్షపాతిగా పనిచేస్తున్నారన్నారు. మహిళల కోసం ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలను ఆర్థికంగా తీర్చిదిద్దడానికి సర్కారు ప్రయత్నం చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయ లక్ష్మీ దేవేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవిందమ్మ, నాయకులు సుమలత తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి

రాయికల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి నివారణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత సూచించారు. రాయికల్ పట్టణంలో శనివారం అదనపు కలెక్టర్ పర్యటించారు. రాయికల్ మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ ఫీజు వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించని వారితో ఫోన్‌లో మాట్లాడి మార్చి 31లోపు 25 శాతం రాయితీతో ఫీజులు చెల్లించాలని తెలిపారు. రాయికల్ పట్టణంలో ఎల్ఆర్ఎస్ కోసం ఇప్పటివరకు 25 మంది రూ.8 లక్షలు చెల్లించారని పేర్కొన్నారు. ఇంటి పన్ను చెల్లించని బకాయిదారుల ఇళ్లకు వెళ్లి మార్చి 31లోపు పన్ను చెల్లించేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ ఖయ్యూం, మేనేజర్ వెంకటి, టీపీవో ప్రవీణ్, ఏఈ ప్రసాద్ తదితరులు ఉన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

నీతి కథల పుస్తకం ఆవిష్కరణ



అనువాద కథల పుస్తకం ఆవిష్కరిస్తున్న సినీ హీరో సుమన్

వెల్గటూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కొత్తకొండ మనోజ్ కుమార్ అనువదించిన 'ది స్కార్పియన్స్ అవెకింగ్ అండ్ అదర్ స్టోరీస్' అనే నీతి కథల పుస్తకాన్ని శనివారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ధర్మపురికి చెందిన సంగనభట్ల చిన్న రామకృష్ణయ్య తెలుగులో రాసిన నీతి కథలను కొత్తకొండ మనోజ్ కుమార్ అనువదించి 'ది స్కార్పియన్స్ అవెకింగ్ అండ్ అదర్ స్టోరీస్'గా ఇంగ్లీషులోకి మనోజ్‌కుమార్ అనువదించారు. దీనిని హైదరాబాద్ రవీంద్రభారతిలో సినీ హీరో సుమన్ ఆవిష్కరించారు. సంగీత దర్శకులు ఘంటాడి కృష్ణ, ప్లేబాక్ సింగర్ ప్రణయ్, తారా ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్ డైరెక్టర్ సుంకె రాణిష, మాజీ బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహనరావు, తెలంగాణ సాహిత్య అకాడమీ మొదటి చైర్మన్ నందిని సిద్దారెడ్డి, మల్కాజిగిరి అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ప్రముఖ ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల సంఖ్య పెంపుపై దృష్టి

కథలాపూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామి పథకం కింద చేపడుతున్న పనులకు కూలీల సంఖ్య పెంపు కోసం ప్రత్యేక దృష్టి సారించినట్టు ఎంపీడీఓ శంకర్‌నాయక్ తెలిపారు. ప్రస్తుతం మండలంలోని 19 గ్రామాల్లో ప్రతీదినం వెయ్యి మంది కూలీలు పనులకు వెళ్తున్నారని ఆ సంఖ్యను పెంచడానికి ఉపాధి సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో పని ప్రదేశాలవద్ద ఓఆర్ఎస్ పాకెట్లు సిద్ధంగా ఉంచాలని సూచించినట్టు తెలిపారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

కొడిమ్యాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నమిలికొండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏనుగు మల్లారెడ్డి ఇటీవల ఢిల్లీలోని కేంబ్రిడ్జ్ డిజిటల్ యూనివర్సిటీ వారితో సామాజిక సేవా రంగంలో గౌరవ డాక్టరేట్ పొందినందుకుగాను శనివారం పాఠశాలలో గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు మల్లారెడ్డికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అంతకుముందు పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐదో రోజుకు చేరిన నిరసన దీక్ష

జగిత్యాల అర్బన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మాదిగలకు రిజర్వేషన్ జనాభా దామాషా ప్రకారం కల్పించాలని, ఎస్సీల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన తర్వాతనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన దీక్ష శనివారం ఐదో రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బోనగిరి కిషన్, నక్క రమేష్, బిరుదుల శ్రీనివాస్, శనిగారపు కాంతక్క, దూమాల గంగన్న తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సురేశ్ షెట్కార్‌ను కలిసిన కాంగ్రెస్ నేత

జగిత్యాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్‌ను శనివారం హైద్రాబాద్‌లో జగిత్యాలకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గుంటి జగదీశ్వర్ కలిశారు. ప్రభుత్వం త్వరలో జరపనున్న నామినేటెడ్ పోస్టుల భర్తీలో బీసీలకు ప్రత్యేక అవకాశాలు కల్పించాల్సిందిగా కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎంపీ సురేశ్ షెట్కార్ పరిస్థితిని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకవెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ శంకరయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ధర్మపురిలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



లక్ష్మీనర్సింహస్వామి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

ధర్మపురి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు సాగుతున్నాయి. భక్తుల సంఖ్య శనివారం తగ్గుముఖం పట్టింది. భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం లక్ష్మీనృసింహ స్వామి, అనుబంధ ఆలయాల్లో స్వామివారలను దర్శనం చేసుకున్నారు. అనంతరం చల్లగా దీవించూ నరసయ్యా అంటూ మొక్కులు చెల్లించుకుని వెనుతిరిగి వెళ్లిపోయారు. టీటీడీ ధర్మశాల ఆవరణలో ఆలయం పక్షాన భక్తులకు అన్నదానం చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఆలయానికి రూ 14,57,210 ఆదాయం లభించింది. ఇందులో వివిధ రకాల పూజల టిక్కె ట్లు విక్రయించగా రూ 6,22,558 లభించగా లడ్డు, ప్రసాదాల ద్వారా రూ 6,77,850 లభించాయి. అన్నదానం కోసం భక్తులు రూ 1,56,802 విరాళాలు సమర్పించినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం ఆవరణలో గల శేషప్ప కళా వేదికపై స్థానిక నాట్య కళాకారులు లాస్య, శ్రీకీర్తి, సువిధ, బిందుశ్రీచే నిర్వహించబడిన నృత్య ప్రదర్శన శనివారం రాత్రి భక్తులను ఎంతో ఆకట్టుకుంది. రాత్రి వేళలో కరీంనగర్‌కు చెందిన బి. రేవతి పాడిన భక్తి, సంగీత పాటలు, గుండి ప్రేమ్‌కుమార్, ఒజ్జల పుల్లయ్య శాస్త్రి నిర్వహించిన మిమిక్రీ శ్రోతలు విని ఆనందం పొందారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, పాలెపు ప్రవీణ్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

● **బ్రహ్మోత్సవాల్లో నేడు..**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 16న ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు బ్రహ్మపుష్కరిణి (కోనేరు)లో వేంకటేశ్వర స్వామి తెప్పె, డోలోత్సవం, సాయంత్రం వేళలో లక్ష్మీనృసింహ స్వామి దక్షిణ దిగ్యాత్ర ఉంటుందని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.

యువత క్రమశిక్షణతో మెలగాలి

కొడిమ్యాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : యువత క్రమశిక్షణతో మెలగాలని డీఆర్‌డీఏ పీడీ రఘువరణ్ అన్నారు. భారత ప్రభుత్వం క్రీడలు మరియు యువజన మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర సంఘటన ఆదేశాల మేరకు నెహ్రూ యువ కేంద్ర జగిత్యాల జిల్లా ఆధ్వర్యంలో శనివారం జిల్లా స్థాయి ఉత్సవ్ కార్యక్రమాన్ని మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ నేటి యువకులు విద్యతో పాటు ఆరోగ్యానికి ఉపయోగపడే క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, యోగాలాంటి అంశాల్లో పాల్గొనాలన్నారు. యువత కష్టపడి అనుకున్నది సాధించి ఉత్తమ పౌరులుగా తయారు కావాలన్నారు. వివిధ రకాల పోటీల్లో పాల్గొన్న యువతి యువకులకు అభినందనలు తెలిపారు. విజేతలకు సర్టిఫికెట్లను, బహుమతులను అందించారు. నెహ్రూ యువకేంద్ర జిల్లా యువజన అధికారి ఎం. వెంకటరాంబాబు, ఎన్ఎస్ఎస్ అధికారులు, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కొడిమ్యాల: బుగ్గారం మండలం గోపులాపురం గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికురాలిగా పని చేస్తున్న న్యాతరి మల్లమ్మ ఇటీవల జగిత్యాలలో జరిగిన రోడ్డు ప్రమాదానికి గురికాగా బాధితురాలికి శనివారం గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్ రెండు వేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు.

ఎండపల్లి: మండలంలోని గుల్లకోట గ్రామంలో శనివారం ఎడ్లబండ్ల పోటీలు పోటాపోటీగా సాగాయి. వేణుగోపాల స్వామి జాతర సందర్భంగా గ్రామస్థులు, ఆలయ కమిటీ ఈ ఎడ్లబండ్ల పోటీలను నిర్వహించారు. మొదటి బహుమతిగా నేరేళ్ల నరేష్‌గౌడ్ (వెనుగుమట్ల) 2.5గ్రాముల బంగారం, రెండో బహుమతిగా దొనకొండ సుధీర్ (శెకల్ల) 10 గ్రాముల వెండి, మూడో బహుమతిగా మాదాసు గాయత్రి (చెర్లపల్లి), పొట్లపల్లి సాగర్ (అచలాపూర్) 5 గ్రాముల వెండి గెలుపొందారు.

మల్లాపూర్: మండలంలోని మొగిలిపేటలోని ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, సామగ్రిని కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షుడు గోల్కండ రమేష్ అందజేశారు.

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్ గ్రామ శివారులోని ఖజాన కుంట మత్తడి ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సారెస్పీ ఏఈ జయప్రకాష్, పరివాహక ప్రాంత రైతులతో కలిసి కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బీర్‌పూర్: జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో తుంగూర్ జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది.

జగిత్యాల అర్బన్: సారంగపూర్ మండలం నగునూర్ లచ్చక్కపేట గ్రామంలోని అంబేద్కర్ విగ్రహంపై జరిగిన దాడికి నిరసనగా జగిత్యాల పట్టణంలో దళిత సంఘాల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

కొడిమ్యాల: మండలంలోని పూడూర్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు కూల్ ఫ్రిడ్జ్, సీసీ కెమెరాలను, కమర్షియల్ వాటర్ ప్లాంట్‌ను శనివారం అందించారు.

- మండలంలోని రాంసాగర్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలకు శనివారం డబ్బుతిమ్మయ్యపల్లి గ్రామ నాయకుడు ఏలేటి కమలాకర్‌రెడ్డి 25 వేల రూపాయల విలువైన ప్యూరీఫైడ్ వాటర్ మిషన్లను సమకూర్చగా గ్రామస్థులు పాఠశాలకు అందించారు.

తుషార్ గాంధీ చిత్రపటం దహనం

జగిత్యాల అగ్రికల్చర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ మునిమనువడు తుషార్ గాంధీ చిత్రపటాన్ని పట్టణంలోని స్థానిక తహసీల్ చౌరస్తా వద్ద భారత సురక్షా సమితి నాయకులు శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరువనంత పురంలో ఇటీవల జరిగిన ఓ సమావేశంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు ప్రమాదకరమనవి అంటూ చేసిన వ్యాఖ్యలతో తుషార్ గాంధీ నిజస్వరూపం బయటపడిందన్నారు. బేషరతుగా ఆర్ఎస్ఎస్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర బాధ్యులు ఏసీఎస్ రాజు, నాయకులు పుప్పాల సత్యనారయణ, వేములపో చమల్లు, సింగం గంగాధర్, లక్ష్మారెడ్డి, తునికి అంజన్న, గాదాసు భూమన్న పాల్గొన్నారు.

మల్లన్నస్వామి బోనాల ఉత్సవాలు ప్రారంభం

మెట్‌పల్లి రూరల్, మార్చి 15, (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గ్రామంలోని మల్లన్న స్వామి ఆలయంలో బోనాల జాతర ఉత్సవాలు శనివారం ప్రారంభమైంది. ఉదయం ఆలయంలోని ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గంగా స్నానానికి నిర్వహకులు, పూజారి ఆసరి మహేష్‌యాదవ్ ఇబ్రహీంపట్నం మండలంలోని ఏర్గండి గంగకు తీసుకెళ్లారు. అక్కడ విగ్రహాలకు జలాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం తిరిగి ఉత్సవమూర్తులను డప్పు చప్పులతో గ్రామంలోని ఆలయంలో ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి స్వామి వారి కల్యాణాన్ని పురోహితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వేల సంఖ్యలోని భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.

కార్యక్రమంలో ఆలయాభివృద్ధి కమిటీ చైర్మన్ మిట్టపల్లి నారాయణరెడ్డి, వైస్‌చైర్మన్లు కచ్చు శ్రీని వాస్, పిల్లి పెద్ద మల్లేష్ యాదవ్, మేర్గు రమేష్‌గౌడ్, నాయకులు కాటిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, దొతూల రమేష్, కాటిపల్లి రఘుపతిరెడ్డి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల రాకతో ప్రభుత్వ కళాశాలలు బలోపేతం

జగిత్యాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ నూతన జేఎల్‌ల నియామకాలు చేపట్టడంతో ప్రభుత్వ కళాశాలలు మరింత బలోపేతం అయ్యాయని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ 475 జిల్లా కమిటీ అధ్యక్షుడు కొట్టాల తిరుపతిరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల(బాలికలు), బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన లెక్చరర్లు సాయిశిల్ప, రాగలహరి, అయేషా ఫాతిమా, జమీల్ అహ్మద్, అతియా ఫాతిమా, శ్రీనివాస్, అనిష్, అబ్దుల్ సలాంలకు ప్రిన్సిపాల్ ఆలియా మక్సూద్, అధ్యాపకుల చేతులమీదుగా పెన్‌లు బహూకరించి నూతన లెక్చరర్లను కళాశాలలకు స్వాగతించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కౌన్సిలర్ కంకణాల శ్రీనివాస్, అధ్యాపకులు సునీత, సుమేరా, దేవ స్వరూప, జగన్ పాల్గొన్నారు.



ఇటీవల నియామకమైన జేఎల్‌కు స్వాగతం పలుకుతున్న సంఘం నాయకులు

ఏకరూప దుస్తుల తయారీపై అవగాహన

జగిత్యాలరూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రాబోయే ఆర్థిక సం వత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో అందించే ఏకరూప దుస్తుల తయారీ విధానంపై జగిత్యాల రూరల్ మండలంలోని పొరండ్ల గ్రామంలోని దుస్తులు కుట్టే మహిళసంఘాల సభ్యులకు జిల్లా సెర్ప్ డీపీఎం విజయాభారతి శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సకాలంలో దుస్తులు అందించేందుకు మహిళసంఘాల సభ్యులకు అవగాహన కల్పించి సన్నద్ధం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, సీసీలు రవీందర్, గ్రామసమైక్య సంఘాల సభ్యురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవాగ్దేవి విద్యాసంస్థల వీడ్కోలు హంగామా



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మల్యాల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మల్యాల మండల కేంద్రంలోని శ్రీవాగ్దేవి విద్యాసంస్థల ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ముత్యంపేట రెడ్డి కల్యాణ మండపంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల నృత్యాలు, ఇతరాత్ర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మండల విద్యాధికారి జయసింహారావు, శ్రీవాగ్దేవి విద్యాసంస్థల కరస్పాండెంట్ పోకల నరేష్ కుమార్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భిక్షాటన చేస్తూ ఫీల్డ్ అసిస్టెంట్ల నిరసన

రాయికల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నామని రాయికల్ మండల ఫీల్డ్ అసిస్టెంట్లు శనివారం దుకాణాల ఎదుట భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా జీతాలు లేక కుటుంబాలను పోషించలేని తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు భూక్య తిరుపతి, కనికరపు లక్ష్మణ్, మహ్మద్ నసీర్, మామిడిపెల్లి మహేష్, నర్సయ్య, మల్లేశం, లక్ష్మణ్, ఇందూరి తిరుపతి, శ్రీనివాస్, తిరుపతి, రాజేందర్, శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయ పేరు మార్పు వద్దు

జగిత్యాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ పేరు మార్పు యోచనను పాలకులు విరమించుకోవాలని జగిత్యాల ఆర్యవైశ్య సంఘ నాయకులు జిల్లా గంగాధర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ పేరును మార్చు చేయడానికి పాలకులు ప్రయత్నాలు చేస్తుండడం బాధకరమన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు.